సాక్షి పల్నాడు

గురువారం ౹ 2 ౹ మే ౹ 2024



206మందికి వైద్యపరీక్షలు

ఫిరంగిపురం: రేపూడిలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యాన బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. 206 మందికి వైద్యురాలు శ్వేత పరీక్షలు చేసి మందులు అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 505.0 0అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



శ్రీవారి కల్యాణ మహోత్సవం

నగరంపాలెం: గుంటూరు పండరీపురంలోని కోదండరామ మందిరంలో వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం మొదలయ్యాయి.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. వినుకొండ టౌన్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని, ఎలాంటి అలజడులు లేకుండా ఎవరి ఓటు వారు వినియోగించుకోవాలని సూచించారు. సమస్యాత్మకమైన గ్రామాల్లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట వినుకొండ సీఐ సాంబశివరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ 29న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: ఈనెల 11వ తేదీన నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్ జూన్ 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.సత్యశ్రీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు.

రేపు మహిళా కళాశాలలో ఇంటర్వ్యూలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈనెల 3వ తేదీన ఉదయం 10 గంటలకు ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రాంగణంలో జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు డిగ్రీ, పీజీ (బీటెక్, ఎంబీఏ మినహా) పూర్తి చేసిన 26 ఏళ్ల లోపు వయసు గల యువతీ, యువకులు హాజరు కావాలని సూచించారు. బయోడేటా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, ఇతర అర్హతలకు సంబంధించిన జిరాక్స్ కాపీలతో నేరుగా హాజరు కావాలని తెలిపారు.

మద్యం షాపుల తనిఖీ



నెహ్రూనగర్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళగిరి, తాడేపల్లి పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్స్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీ మాట్లాడుతూ సిబ్బంది నిబంధనలకు మేరకు మద్యం అమ్మకాలు చేపట్టాలని, అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

తీరంలో ఇద్దరిని కాపాడిన పోలీసులు, గజ ఈతగాళ్లు

సిబ్బందిని అభినందించిన ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల టౌన్: సముద్రంలో స్నానాలు చేస్తుండగా అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఇద్దరిని గజ ఈతగాళ్లు కాపాడిన ఘటన బుధవారం సూర్యలంక తీరంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళగిరి పట్టణానికి చెందిన వేశం భాను ప్రకాష్, గాలి కిరణ్‌బాబు స్నేహితులతో కలిసి సూర్యలంక సముద్రతీరానికి విహారయాత్రకు వచ్చారు. వీరంతా సముద్రంలో స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి ఇద్దరు సముద్రంలో కొట్టుకుపోసాగారు. స్నేహితులు కేకలు వేయడంతో తీరంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లు తక్షణమే స్పందించి మునిగిపోతున్న వారిని రక్షించి, ఒడ్డుకు చేర్చారు. ప్రథమ చికిత్స చేశారు. ఇద్దరు యువకుల ప్రాణాల్ని రక్షించిన కానిస్టేబుల్ ఎస్.నాగరాజు, హోంగార్డులు ఎన్‌నరసింహమూర్తి, శ్రీనివాసరావు, నాగరాజు, గజ ఈతగాళ్లు సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఆంజనేయులు, శివ కోటేశ్వరరావును యాత్రికులతో పాటు, ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5500, గరిష్ట ధర రూ.7800, మోడల్ ధర రూ.6500 వరకు పలికింది.

ప్రచార పర్వం







పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ప్రచారం ఊపందుకుంది. ఎండ తీవ్రతను లెక్క చేయకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి, మాచర్ల, వినుకొండ నియోజకవర్గాలలో బుధవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం దేవరంపాడులో మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు ప్రచారం నిర్వహించారు. మహిళలు దిష్టి తీసి స్వాగతం పలికారు. మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం పోలేపల్లిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రచారం నిర్వహించారు. వినుకొండ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అవ్వాతాతలకు తప్పని కష్టాలు



సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో వికలాంగులకు ఇంటి వద్దే నగదు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్

- టీడీపీ పన్నాగంతో రెండు నెలలుగా ఆగిన ఇంటింటికి పెన్షన్ పంపిణీ
- ఆధార్ లింక్ ఉన్న 2,10,012 మంది బ్యాంక్ ఖాతాలలో నగదు జమ
- దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న 71,228 మందికి ఇంటి వద్దే నగదు పంపిణీ
- బ్యాంక్‌లో జమ కాని వారికి ఇంటి వద్దే నగదు అందజేయనున్న సచివాలయ సిబ్బంది
- చంద్రబాబు తీరుతోనే మాకు ఈ కష్టాలు అంటున్న పింఛన్ లబ్ధిదారులు

సాక్షి, నరసరావుపేట: అవ్వాతాతలపై చంద్రబాబు పగ కొనసాగుతోంది. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయం ముందే అవ్వాతాతలకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందించే వలంటీర్ వ్యవస్థపై పచ్చపార్టీ కక్ష కట్టి గత నెలలో దాన్ని అడ్డుకున్నారు. వారు చేస్తున్న నిస్వార్థ సేవకు పొందుతున్న అభిమానం చూసి ఓర్వలేని చంద్రబాబు తన అనుచరులతో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయించి పింఛన్ పంపిణీని అడ్డుకున్నారు. దీంతో ఏప్రిల్ నెలలో సచివాలయాల వద్దకు వెళ్లి వైఎస్సార్ పెన్షన్‌కానుక లబ్ధిదారులు నగదు తెచ్చుకున్నారు. లక్షలాది మంది వృద్ధులు గతనెలలో పడిన కష్టాలను చూసి అయ్యోపాపం అనుకొని ఎప్పటిలాగే వలంటీర్ వ్యవస్థ ద్వారా పంపిణీకి చంద్రబాబు అండ్ కో సానుకూలంగా స్పందిస్తారని అనుకున్నారు. టీడీపీ, తన భాగస్వామ్యపార్టీలతో మెరుపు ధర్నాలు, ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులు చేసి ఆ సమస్యను మరింత జఠిలం చేశారు. ఇందులో భాగంగా వృద్ధుల పింఛన్‌కు అనుసంధానమైన బ్యాంక్ ఖాతాలకు నగదు పంపేలా మే నెలలో కొత్త పద్ధతి తెరమీదకు తీసుకువచ్చారు. వికలాంగులు, తీవ్ర అనారోగ్యపాలైన వారికి, బ్యాంక్ ఖాతాలలో నగదు జమ కాని వారికి సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దే నగదు పంపిణీ చేస్తున్నారు.

బాబు నిర్వాకం వల్లే...

నగదు బ్యాంక్‌లో జమ అయ్యిందా లేదనన్న విషయం తెలియక వృద్ధులు తీవ్ర ఆందోళన పడుతున్నారు. ఒకవేళ బ్యాంక్ ఖాతాలో నగదు జమ అయినా ఎలా నగదు తీసుకోవాలన్న ఆందోళన వారిలో వెంటాడుతోంది. 45 డిగ్రీలకు పైగా ఎండలు మండుతున్న సమయంలో బ్యాంక్‌ల చుట్టూ తిరగగలమా అని ఆందోళన చెందుతున్నారు. ఇదంతా చంద్రబాబు కుట్ర అని, మా లాంటి వృద్ధులు, వికలాంగుల ఉసురు పోసుకొని రాజకీయంగా ఏం సాధిద్దామని ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్ వ్యవస్థపై కుట్రపన్నుతున్నారని, మాకు ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటికి పింఛన్ నగదు పంపే జగన్‌నే మరోసారి సీఎంగా ఎన్నుకుంటామని పింఛన్ దారులు చెబుతున్నారు.

పల్నాడు జిల్లాలో మే నెలకు మొత్తం 2,81,240 మందికి రూ.84 కోట్ల నగదును ప్రభుత్వ విడుదల చేసింది. ఇందులో 2,10,012 మందికి ఆధార్‌తో లింక్‌అయిన బ్యాంక్ ఖాతాలలో నగదు జమ ప్రారంభించారు. ఎవరికైనా నగదు జమలో ఇబ్బందులు ఎదురైతే రేపటి నుంచి నగదును సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయనున్నారు. మిగిలిన 71,228 మంది వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ.21 కోట్ల ఇంటి వద్దనే నగదు పంపిణీ బుధవారం నుంచి ప్రారంభించారు. ఇందులో ఒకటో తేదీ రాత్రి 7 గంటలకు 46,388 మందికి రూ.13.72 కోట్లను ఇంటివద్దే అందజేశారు.

మండుటెండలో ఏడు కి.మీ. వెళ్లి నగదు తెచ్చుకోగలనా...



నాకు వృద్ధాప్య పింఛన్ కింద నెల నెలా ఒకటో తేదీన ఇంటి వద్దనే వలంటీర్ రూ.3 వేల నగదు అందించేవారు. టీడీపీ వాళ్లు కేసు వేశారని వలంటీర్లను డబ్బులు పంపిణీ చేయొద్దని చెప్పారట. గత నెల గ్రామ సచివాలయానికి మండుటెండలో వెళ్లి ఎలాగోలా తెచ్చుకోలిగినా. ఈనెలలో బ్యాంక్‌లో వేస్తామంటున్నారు. దుర్గి బ్యాంక్‌కు వెళ్లాలంటే ఏడు కిలోమీటర్లు వెళ్లాలి. ఈ ఎండల్లో వెళ్లి తెచ్చుకోవడం నావల్ల అయ్యేపనేనా. ఒకవేళ ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే నేను తట్టుకోగలనా.. దయచేసి మాలాంటి వారి బాధను అర్థం చేసుకొని ఎప్పటిలాగే వలంటీర్ ద్వారా నగదు పంపిణీ చేయాలి.

– అన్నెం వీరమ్మ, అత్మకూరు గ్రామం, దుర్గి మండలం.

రేపు క్రోసూరుకు సీఎం వైఎస్ జగన్



సీఎం వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్

క్రోసూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పెదకూరపాడు నియోజకవర్గం పరిధిలోని క్రోసూరు రానున్నారు. సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ బుధవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మధ్యాహ్నం 1.30 గంటలకు క్రోసూరులో జరిగే మేమంతా సిద్ధం సభలో ప్రసంగిస్తారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ క్రోసూరుకు హాజరై హెలిపాడ్ గ్రౌండ్‌ను, సభ జరిగే ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీతోపాటు సత్తెనపల్లి డీఎస్పీ జీసీ గురునాథబాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, పెదకూరపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంగారావు, క్రోసూరు ఎస్ఐ మహమ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్

ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రోసూరు పర్యటన ఏర్పాట్లను పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం ఏర్పాట్లు పరిశీలించారు. హెలీప్యాడ్, సభా స్థలం, వాహనాల పార్కింగ్ అంశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేర సమాచారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నరసరావుపేటటౌన్: నేర సమాచార సేకరణ నిమిత్తం ఎక్సైజ్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి జి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు.

మద్యం అక్రమాలపై సంబంధిత కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9032690039 కు తెలియజేయాలన్నారు. సమాచారం అందజేసిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడ్డ 17 మంది సిబ్బందిని ఉద్యోగం నుంచి తొలగించామని తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.7.92 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు

- కావాలనే ఈ చట్టంపై టీడీపీ నాయకులు దుష్ప్రచారం
- ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: టీడీపీ నాయకులు ప్రచారం చేస్తున్న ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని వైఎస్సార్ సీపీ నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చట్టంపై హైకోర్టులో కేసు నమోదైందని, తీర్పు కోసం వేచి చూస్తున్నారన్నారు. దీనిపై టీడీపీ నాయకులు వారి సోషల్ మీడియా ఆధారంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆస్తులను దోచుకునేందుకు తీసుకొచ్చారని, దీని అమలు కోసం జీఓ కూడా జారీ చేశారంటూ ఒక తప్పుడు ప్రచారం మొదలు పెట్టారన్నారు. ఎన్నికల వేళ సీఎం జగన్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీయటమే ధ్యేయంగా ఈ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 20ఏళ్లపాటు డీకే భూమిని సాగుచేసుకుంటుంటే హక్కులు కల్పించిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. వేల ఎకరాలపై దళితులకు హక్కులు కల్పించారన్నారు. చంద్రబాబునాయుడు ఏనాడు దళితులకు భూమిపై హక్కు ఇవ్వాలని అనుకోలేదన్నారు.

బాబుకు మేనిఫెస్టోపై గౌరవం లేదు

చంద్రబాబుకు ఏనాడూ మేనిఫెస్టోపై గౌరవంలేదన్నారు. 2014ఎన్నికల సందర్భంగా రైతు రుణమాఫీ చేస్తానని రైతుల ఓట్లతో అధికారంలోకి రాగానే రూ.87వేల కోట్ల రుణ మాఫీని చేయకుండా కుటుంబరావు కమిటీ వేసి కేవలం రూ.11వేల కోట్లు మాఫీ చేశాడన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి 2019 ఎన్నికలకు ముందు ఆర్నెల్లుపాటు మాత్రమే కొంతమందికి ఇచ్చాడన్నారు. జాబు రావాలంటే బాబు రావాలని చెప్పి ఐదేళ్లలో 32వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చాడన్నారు. ప్రస్తుతం ప్రకటించిన మేనిఫెస్టో అమలు కోసం ఏడాదికి రూ.12లక్షలు కోట్లు కావాలని ఆర్థిక శాస్త్రవేత్తలు, విశ్లేషకులు అంచనా వేశారని, మన రాష్ట్ర బడ్జెట్ రూ.2.34లక్షల కోట్లు మాత్రమే అన్నారు. బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ చరిత్రలో మేనిఫెస్టోపై ప్రజలకు విశ్వసనీయత కల్గించిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. సీనియర్ నాయకులు డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై జరుగుతున్న దుష్ప్రచారం అందరూ ఖండించాలని కోరారు.

సుపరిపాలన వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్
- ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడితో కలిసి ఎన్నికల ప్రచారం
- ప్రచారంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్
- భారీగా తరలివచ్చిన ప్రజలు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఓటువేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని... చంద్రబాబుకు ఓటు వేస్తే పంగనామాలు పెడతాడని వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పి అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని 12, 13 వార్డుల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో అధిక సంఖ్యలో ప్రజలు హాజరై పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పి అనిల్‌కుమార్ యాదవ్, కావటి శివనాగ మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లకు దిష్టితీసి, ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్నికల ప్రచారరథంపై రోడ్‌షో నిర్వహించారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటుచేయడంతోపాటు పథకాల ద్వారా సంక్షేమ పాలన కొనసాగించారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజలు గుర్తుంచుకునే ఒక్క పథకానైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్లు చేస్తామని సీఎం జగన్ చెబితే, దానిపై కోర్టులో కేసు వేశారన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

నివేశన స్థలాలు పంపిణీ చేస్తే సమాధితో పోల్చడం సమంజసమేనా అన్నారు. కూటమి మేనిఫెస్టో అమలు సాధ్యమేనా అని ప్రశ్నించారు. వలంటీర్లను కొనసాగిస్తామని, వారి వేతనం పెంచుతామని చెప్పడం, సంక్షేమాలే వద్దన్న బాబు ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ అధికారం కోసం అబద్ధాలు వల్లెవేస్తున్నారన్నారు. బాబు బూటకపు మాటల్ని ఎవరూ నమ్మవద్దన్నారు. సుపరిపాలన వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనతో దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకాలను రాష్ట్రంలో ప్రవేశపెట్టి అన్ని వర్గాల అభ్యున్నతిని కాంక్షించిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మే13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై తమ రెండు ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థిగా పి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థిగా కావటి శివనాగ మనోహర్ నాయుడిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, ఏఎంసీ మాజీ చైర్మన్లు తోట రాజేంద్రప్రసాద్, బొల్లెద్దు చిన్న, మద్దిరాల విశ్వనాథం, కౌన్సిలర్లు దొడ్డా ఇందిర, షేక్ మీరాబీ, పార్టీ యూత్ జిల్లా కన్వీనర్ సాతులూరి కోటి, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్



ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న కలెక్టర్, పరిశీలకులు

నరసరావుపేట: పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని కేటాయించే రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సజావుగా పూర్తిచేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు సర్వేష్ నరేంద్ర, శేష మణి పాండే పర్యవేక్షణలో ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వివిప్యాట్స్ రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ప్రకారం నిర్ణీత సమయంలో పకడ్బందీగా ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టామన్నారు. దీనికోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసిందన్నారు. పోలింగ్‌స్టేషన్ల వారీగా ర్యాండమైజేషన్ చేపట్టి పూర్తి చేశామన్నారు. ఈవీఎం, వీవీప్యాట్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియపై అభ్యర్థులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, అభ్యర్థులు, రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

ఎన్నికల విధులకు హాజరయ్యే అందరికీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించామని జిల్లా ఎన్నికల అధికారి బుధవారం వెల్లడించారు. ఈ నెల ఐదున పీవో, ఏపీవో, ఓపీవోలకు, మే ఆరున పోలీస్ సిబ్బందికి, మే ఏడున డ్రైవర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్లు, అత్యవసర సర్వీసులలో పనిచేసే 33 శాఖలకు చెందిన ఉద్యోగులకు ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు సదుపాయం కల్పించామన్నారు. ఈనెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఫారం 12 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఓటింగు సౌకర్యం కల్పించబడుతుందన్నారు.

క్లుప్తంగా

ఆదరించి ఆశీర్వదించండి



కారెంపూడి: ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఆశీర్వదించాలని కోరుతూ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కారెంపూడిలో బుధవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. 281 బూత్ ఏరియాలో ప్రతి ఇంటికి వెళ్లి కర పత్రాలు పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ప్రభుత్వ విప్ పీఆర్కేని, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లను కోరుతూ ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు బొమ్మిన అల్లయ్య, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, మాజీ సర్పంచ్ కంపా నాగరాజు, ఎంపీటీసీ అంతరగడ్డ ఏసోబు, కిల్లా కాశి, ఆళం విజయభాస్కరరెడ్డి, మిద్దెపోగు పున్నయ్య, కాల్వ ప్రభుదాసు, కటికల కుమార్ ప్రచారంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే గిరిజనులకు న్యాయం

వైఎస్సార్‌సీపీ ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతునాయక్



వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తోనే అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని దావుపల్లి, సేవా నాయక్ తండా, పాపిరెడ్డికుంట తండ, వజ్రాలపాడు, హనుమాపురం తండా, రామచంద్రాపురం తండాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలకు మద్దతు పలికి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటి సభ్యులు సభావత్ రవినాయక్, సర్పంచ్‌లు ఆర్ మాద్యానాయక్, కె శ్రీనునాయక్, జిల్లా అటవీ హక్కుల కమిటీ సభ్యుడు రంగానాయక్, ఎంపీటీసీ కేలా నాయక్, గిరిజన నాయక్‌లు ఎం అంజనీకుమార్ నాయక్, స్వాతంత్ర్య నాయక్, రాములు నాయక్ తదితరులున్నారు.

రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మండాది గ్రామంలో ప్రభుత్వ విప్ పీఆర్కేకు గజమాలతో సత్కారం

వెల్దుర్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి సాధించాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యమవుతుందని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండాదిలో ప్రభుత్వ విప్ పీఆర్కేకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు వీరికి హారతులు పట్టారు. బుధవారం రాత్రి మండలంలోని మండాది గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం సీఎం జగన్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.గతంలో ఇచ్చిన మ్యానిఫెస్టోలోని అంశాలను 99శాతం అమలు చేశారన్నారు. చేయగలిగిన పనులే చెబుతామని, అలివిగాని హామీలిచ్చి మ్యానిఫెస్టోలోను వెబ్‌సైట్ల నుంచి తొలగించే పద్ధతి వైఎస్సార్‌సీపీకి లేదన్నారు. మళ్ళీ మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు జట్టుకట్టి ప్రజల వద్దకు వస్తున్నారని, వారికి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. 2014లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వివిధ రాష్ట్రాలలోని పార్టీల మ్యానిఫెస్టోను కలగూర గంపలా చేసి అలివిగాని హామీలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండా రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ విభజన విభాగం ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధానకార్యదర్శి మేకల కోటిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, పులుసు నారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్ శీలం సైదారెడ్డి, మాజీ సర్పంచ్ పులి త్రినాథ్‌రెడ్డి, ఎంపీటీసీ కాంతారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎదురూరి కృష్ణారెడ్డి, చిన్నపరెడ్డి చినమల్లారెడ్డి, కామిరెడ్డి లింగారెడ్డి, పులి కృష్ణారెడ్డి, ఈశ్వరరెడ్డి, వెంకట నారాయణ, శీలం చిన సైదారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులున్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: అన్ని వర్గాల అభివృద్ధే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 5వ వార్డు పులిచింతల పునరావాస కేంద్రంలో బుధవారం ఆ ప్రాంత వాసులు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్ రెడ్డి హాజరయ్యారు. కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో సుమారు 100 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి చేరారు. వీరందరికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పులిచింతల నిర్వాసితులకు ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరికి పక్కా గృహాలు నిర్మించి ఇచ్చారన్నారు. వీరందరు నివసిస్తున్న భూమికి రిజిస్ట్రేషన్ హక్కును దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ తనయుడైన జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. కొండమోడు నుంచి పేరేచర్ల వరకు సుమారు 2 వేల కోట్లతో జాతీయ రహదారి త్వరలో నిర్మించబోతున్నారని, ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఆర్ ఆర్ సెంటర్‌లోని భూముల విలువ మూడు రెట్లు పెరుగుతాయన్నారు. ఇక్కడ ఉన్న ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందిస్తామని తెలిపారు. మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, వార్డు కౌన్సిలర్ బడిగుంతల నాగమణి, బడిగుంతల వెంకటేశ్వర్లు, చింతలపూడి శ్రీనివాసరావు, నరేష్, వెంకటరెడ్డితో పాటు పలువురు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముస్లింలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలి

- కర్నూలు ఎమ్మెల్యే ఎండీ అబ్దుల్ హాఫీజ్‌ఖాన్
- ఎస్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మైనార్టీల మెగా ఆత్మీయ సమావేశం
- హాజరైన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పి అనిల్‌కుమార్ యాదవ్, కావటి శివనాగ మనోహర్ నాయుడు



ముస్లిం నాయకులతో కర్నూలు ఎమ్మెల్యే ఎండీ అబ్దుల్ హాఫీజ్‌ఖాన్, ఎంపీ అభ్యర్థి పి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: ముస్లింలు తమ బిడ్డల కోసం, భావి తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆలోచించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కర్నూలు ఎమ్మెల్యే ఎండీ అబ్దుల్ హాఫీజ్ ఖాన్ కోరారు. పట్టణంలోని ఎస్ఎంఎస్ గార్డెన్స్ ముస్లిం షాదీఖానాలో బుధవారం ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశం జరిగింది. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ముఖ్య అతిథి కర్నూలు ఎమ్మెల్యే ఎండీ అబ్దుల్ హాఫీజ్‌ఖాన్ పాటు , పార్టీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు.

ముస్లిం అభ్యున్నతికి బాటలు : ఈ సందర్భంగా ఎండీ అబ్దుల్ హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ముస్లింల జీవన ప్రమాణాల మార్పుకు గత ప్రభుత్వాలేవీ పట్టించుకోలేదన్నారు. నాడు డాక్టర్ వైఎస్సార్ ముస్లింలకు 4శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తే నేడు సీఎం జగన్ నవరత్న సంక్షేమ పథకాలతో పాటు రాజకీయ సామాజిక ఆర్థిక పరమైన న్యాయాన్ని చేకూర్చి వారి అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో నూరు శాతం ఓటు హక్కు వినియోగించుకుని వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీకి వెన్నెముక ముస్లింలు : ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ముస్లింలు వెన్నెముక వంటి వారని కొనియాడారు.ముస్లింలకు 2014లో నాలుగు ఎమ్మెల్యే టికెట్లు, 2019లో ఐదు, 2024 ఎన్నికల్లో ఏకంగా 7 ఎమ్మెల్యే సీట్లు కేటాయించారని తెలిపారు. కూటమి బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తే రాష్ట్రంలోని 3వేల మెడికల్ సీట్లలో 120 మంది ముస్లిం విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

వైఎస్సార్ సీపీ సెక్యులర్ పార్టీ : ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ అన్ని కులాలు, మతాలు కలిసిన సెక్యులర్‌పార్టీ వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ అన్నారు. నాడు డాక్టర్ వైఎస్సార్ ముస్లింలకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్‌తో ఆ వర్గంలోని పేదలెందరికో విద్యా ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు.

ఓటు బ్యాంకుగా చూసిన చంద్రబాబు : ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ముస్లింలు టీడీపీ కూటమికి ఓట్లు వేస్తే తమ హక్కుల్ని రిజర్వేషన్లను తామే కాలరాసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు.. కార్యక్రమంలో జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా, సయ్యద్ బషీర్‌మేస్త్రీ, మౌలానా అబ్బాస్‌ఖాన్, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ అల్లీమియా, నాయకులు షేక్ గాలిబ్‌షా, ఏపీఎం సుభాని, పఠాన్ తలహాఖాన్, ఆర్‌కే బాజి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, మైనార్టీ విభాగాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగనన్న

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



టీడిపిని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి సామాజిక న్యాయం అమలు చేసి బడుగు, బలహీన వర్గాలను అక్కున చేర్చుకున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన 10 రజక కుటుంబాల వారు టీడిపిని వీడి ప్రభుత్వ విప్ పిఆర్కే వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ తమకు అన్నీ రంగాలలో గౌరవాన్ని కల్పించి ఆర్థికంగా చేయూతనందించటం సంతోషంగా ఉందని, అందుకే తామంతా వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వ విప్ పిఆర్కేకి మద్దతుగా నిలిచి ఆయన విజయానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేశం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవాయి అంజిరెడ్డి, గౌరెడ్డి వెంకటరెడ్డి, దేశం సీతారెడ్డి, బూసిరెడ్డి సాగర్‌రెడ్డి, దేశం గోవర్ధన్‌రెడ్డి, మోర్తాల వెంకటరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్



గారపాడు గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

పెదకూరపాడు: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. పల్నాడు జిల్లాలో పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక, సాధరణ కేంద్రాలుగా విభజించి అందుకనుగుణంగా బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మండలంలోని గారపాడు గ్రామాన్ని అయన సందర్శించారు. 149 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం ప్రజలతో మమేకమై వారితో మాట్లాడారు. ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నిక సందర్భంగా ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. గతంలో గారపాడు గ్రామంలో జరిగిన సంఘటనలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఓటు విలువ గురించి వివరించారు. ప్రజలకు ఎన్నికల నియమావళి గురించి వివరించారు. ప్రజలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి డియస్‌పి గురునాథబాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్, ఎస్ఐ వెంకట్రావు ఉన్నారు.

మే 5లోగా దూరవిద్య సప్లిమెంటరీ ఫీజు చెల్లించాలి


జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) ఆధ్వర్యంలో జూన్ నెలలో నిర్వహించనున్న ఇంటర్మీడియేట్, పదవ తరగతి దూరవిద్య సప్లిమెంటరీ పరీక్ష ఫీజును ఎటువంటి అపరాధ రుసుం లేకుండా మే నెల 5వతేది లోపు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, డిస్టెన్స్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కె.ఎం.ఏ.హస్సేన్ బుధవారం తెలిపారు. అపరాధ రుసుం రూ.25లతో మే 6వతేదీ వరకు, రూ.50లతో మే 8వతేదీ లోగా చెల్లించాలని వివరించారు. ఈ ఏడాది మార్చి నెలలో నిర్వహించిన దూరవిద్య పరీక్షలో ఫెయిల్ అయిన అభ్యాసకులు, ప్రత్యేక అనుమతితో ప్రవేశాలు పొందిన అభ్యాసకులు పరీక్ష ఫీజులు చెల్లించవచ్చని తెలిపారు. పల్నాడు జిల్లాలో 10వ తరగతిలో 959మంది, ఇంటర్మీడియట్‌లో 1420మంది అభ్యాసకులు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉందని వివరించారు. సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8వతేదీ వరకు నిర్వహిస్తారని తెలిపారు. గత మార్చి నెలలో పాస్/ ఫెయిల్ అయిన అభ్యాసకులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ నిమిత్తం మే నెల 7లోగా ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించాలని తెలిపారు. రీకౌంటింగ్‌కు ఒక సబ్జెక్ట్‌కు రూ.200లు, రీవెరిఫికేషన్‌కు వెయ్యి రూపాయలు చొప్పున చెల్లించాలని వివరించారు.

గిరిజన బాలికల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులు

నరసరావుపేట ఈస్ట్: మండలంలోని పెదతురకపాలెంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5 నుంచి 9వతరగతి వరకు 2024–25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.కుమారి బుధవారం తెలిపారు. ఈనెల 20వతేది వరకు అర్హులైన బాలికలు తమ దరఖాస్తులను పాఠశాలలో అందచేయాలని కోరారు. 5వతరగతిలో ఎస్టీలకు 30, ఎస్సీ 5, బీసీ 2, ఓసీ 1, దివ్యాంగులు, గిరిజన ప్రాంత ఉద్యోగుల కోటా క్రింద ఒక్కో సీటు ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే 6వ తరగతి నుంచి కేవలం గిరిజన బాలికలకు మాత్రమే పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. 6వ తరగతిలో 19, 7వతరగతిలో 15, 8వతరగతిలో 9, తొమ్మిదో తరగతిలో 13 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల గిరిజన విద్యార్థినిలు మే నెల 20వతేది లోపు తమ దరఖాస్తులను పాఠశాలలో అందించాలని కోరారు. వివరాలకు 6309512513, 9441224933 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కారు రిపేరు చేస్తూ మీదపడి యువకుడు మృతి



గుత్తికొండ భూపతిరెడ్డి (32) (పాతచిత్రం)

పెదకూరపాడు: కారు రిపేరు చేస్తుండగా జాకీ స్లిప్ కావడంతో యువకుడు మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోని 75త్యాళ్లూరులో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుత్తికొండ భూపతిరెడ్డి (32) వ్యవసాయంతో పాటు ట్రావెల్స్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు తండ్రి గుత్తికొండ నాగిరెడ్డి రిటైర్డ్ ఆర్మీ కావడంతో తండ్రికి సాయంగా ఉంటున్నాడు. గతవారం రోజుల క్రితం ట్రావెల్స్‌కు ఉపయోగించే మహీంద్రా లోగోస్ కారు రిపేరు వచ్చింది. భూపతిరెడ్డి బాబాయ్ కుమారుడు వివాహం ఉండటంతో కారు రిపేరు చేసేందుకు కుదరలేదు. పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. వివాహం అనంతరం బుధవారం కారు రిపేరు చేసేందుకు డ్రైవర్ నాగూరుతో కలసి కారును జాకీ సాయంతో రిపేరు చేస్తుండగా రిపేరుకు అవసరమైన రెంచీలు తీసుకువచ్చేందుకు డ్రైవర్ వెళ్లగా కారు కింద భాగంలో ఉండి మరమ్మతులు చేస్తున్న భూపతిరెడ్డి పై జాకీ స్లిప్ కావడంతో కారు నుదురుపై పడడంతో అక్కడిక్కడే మృతి చెందారు. రెంచీలు తీసుకు వచ్చిన డ్రైవర్ నాగూరు కారు కింద ఉన్న భూపతిరెడ్డిని చూసి కేకలు వేయడంతో స్థానికులు కారును లేపి చూడగా అప్పటికే మృతిచెందాడు. భూపతిరెడ్డి తెలంగాణలో నైజాంకు చెందిన అమనిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు.

ఎమ్మెల్యే శంకరరావు నివాళులు : ప్రమాదంలో మృతి చెందిన భూపతిరెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరామర్శించి నివాళ్లు అర్పించారు. తండ్రి నాగిరెడ్డిని ఓదార్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

టిప్పర్ ఇంటిపై పడి నిద్రిస్తున్న మహిళ మృతి

చిలకలూరిపేట టౌన్: అదుపు తప్పిన టిప్పర్ సమీపంలోని ఇంటిపై పడటంతో మహిళ మృతి చెందిన సంఘటన పట్టణం పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పోలిరెడ్డిపాలెం రోడ్డు ప్రక్క నివాసాల్లో ఉంటున్న అన్నపరెడ్డి నాగమ్మ(60) కంపెనీల్లో వచ్చే బేళ్లకు ఉపయోగించే వేస్ట్ ప్లాస్టిక్ వైర్లతో బుట్టల్ని తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. బుధవారం తెల్లవారుజామున నరసరావుపేట వైపు నుంచి చిలకలూరిపేటకు వస్తున్న క్రమంలో టిప్పర్ లారీ అదుపుతప్పి నాగమ్మ నివసించే ఇంటిం పై బోల్తాకొట్టింది. దీంతో ఇంట్లో నిద్రిస్తున్న నాగమ్మ సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. భర్త పెదనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు చేసుకుని అర్బన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: రైతాంగం అభివృద్ధి కోసం రైతు భరోసా కేంద్రాలను, పౌర సేవలకు గ్రామ సచివాలయాలను ఆయా గ్రామాల్లోనే నిర్మించి గ్రామ స్వరూపాలను మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పోలేపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు, పార్టీ శ్రేణులు భారీ గజమాలతో పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. యువకులు, మహిళలు, కేరింతల మధ్య ప్రచార కార్యక్రమం ఆద్యాంతం ఉత్సాహంగా సాగింది. గ్రామస్థులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు జై కొట్టి తమ అభిమానాన్ని చాటారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ సత్తా చాటి తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకోవాలని కోరారు. మేనిఫెస్టోను చెప్పినట్లు చేసి చూపించటం మన ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేశం శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసి నామసాని ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాలవాయి అంజిరెడ్డి, గౌరెడ్డి వెంకటరెడ్డి, దేశం గోవర్ధన్‌రెడ్డి, మార్తాల వెంకటరెడ్డి, మాగునూరి చక్రి, దేశం సీతారెడ్డి, బుసిరెడ్డి సాగర్ రెడ్డి, మందా బుజ్జి, మాగులూరి మార్కు, బూసాని సింగరయ్య, పిన్నెల్లి నరసింహారావు, జల్లెడ అచ్చయ్య, పలు గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 50 టీడీపీ ఎస్సీ కుటుంబాలు



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ 50 కుటుంబాలకు చెందిన సుమారు 150మందికి పైగా బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. మండలంలోని మాదిపాడుకు చెందిన 10 టీడీపీ కుటుంబాలకు చెందిన 30మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు.

రిజర్వేషన్లపై అమిత్‌షా చేత చెప్పించే దమ్ముందా

గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు తొలగించమని బీజేపీ నేత అమిషా చేత చెప్పించే దమ్ము చంద్రబాబుకు ఉందా అని వైఎస్సార్‌సీపీ గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతలంతా టీవీ డిబేట్‌లలో, భారీ బహిరంగ సభల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ తొలగిస్తామని చెబుతుంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాత్రం తొలగించమని ఎలా చెబుతారన్నారు. మొన్నటి వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని మెచ్చుకున్న ఎమ్మెల్సీ ఇక్బాల్ ఇప్పుడు వచ్చి రిజర్వేషన్లు తొలగించరంటే ముస్లిం ఓటర్లు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. సమావేశంలో చింతలపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

పెదకూరపాడు : మండల పరిధిలోని రామాపురంకు చెందిన ఇద్దరు చిన్నారులు నీటి గుంతలో పడి మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చోటు చేసుకుంది. రామాపురం గ్రామం ఎస్సీకాలనీకి చెందిన గొడ్డుగర్ల అభి (13), గొడ్డుగర్ల సందీప్ (13) ఇద్దరు గ్రామ శివారులో ఉన్న నీటి గుంతలో చేపలు పట్టేందుకు వెళ్లారు. గుంతలో దిగారు. ప్రమాదవశాత్తు నీటిగుంతలో చిక్కుకుపోయారు. రాత్రి 9 గంటల సమయంలో అభి తల్లిదండ్రులు కిషోర్, బుజ్జి, సందీప్ తల్లిదండ్రులు నాగేశ్వరరావు, మరియమ్మలు పిల్లలు ఇంటికి రాలేదని వెతుక్కుంటూ వెళ్లగా చెప్పులు, దుస్తులు నీటి గుంత బయట ఉండటం గమనించారు. స్థానికుల సహాయంతో నీటి గుంతలో దిగారు. ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.